# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 88 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 25 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4







# కావాలనే కాలయాపన..!

- నత్తనడకన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**మన చౌరాస్తా, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కావాలనే కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను హరీశ్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆసుపత్రి పనులు కావాలనే నత్తనడకన సాగిస్తున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును ఆలస్యం చేయడం వెనుక రాజకీయ అక్కసే కారణమని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఆసుపత్రి భవనం 24 అంతస్తుల వరకు పూర్తి చేశామని, 2024 దసరాకే ప్రారంభించాల్సిన ఈ ఆసుపత్రి ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై చూపుతున్న శ్రద్ధలో కనీసం 10 శాతం అయినా వరంగల్ 'హెల్త్ సిటీ'పై పెట్టి ఉంటే ఈపాటికే పనులు పూర్తయ్యేవని విమర్శించారు. వెంటనే సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తి చేసి, పూర్తి స్థాయి వైద్య సేవలతో ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకానికి ఇప్పటివరకు క్యాబినెట్ ఆమోదం ఉందా? నోటిఫికేషన్లు జారీ చేశారా? అని ప్రశ్నించారు. కేవలం ఓపీ సేవలతో ప్రారంభించడం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లక్ష్యాన్ని తుంచివేయడమేనని అన్నారు. అదే విధంగా వరంగల్‌లోని మహాత్మ గాంధీ మెమోరియల్ హాస్పటల్ (ఎంజీఎం) పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించామని, ప్రస్తుతం పరికరాలు, సిబ్బంది కొరతతో ఆసుపత్రి సేవలు దెబ్బతిన్నాయని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు పనుల విషయంలోనూ ప్రభుత్వం డెడ్‌లైన్‌లను మారుస్తూ కాలయాపన చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించిందని, ప్రస్తుతం రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆరోపించారు. వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే వరంగల్‌లోనే నిరాహారదీక్షకు దిగుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ పర్యటనలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలో ఉన్న 11 దేవాలయాల్లో 11 మంగళవారాలు చొప్పున 11 సార్లు మొత్తం 11,116 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి నేడు జనగామ పట్టణంలోని వెంకన్న కుంటలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో ఉద్యాపన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు పజ్జూరి శారద, లక్ష్మీ నరసయ్య, మాదారపు కల్పన సత్యనారాయణ దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 250 మంది భక్తులు హాజరై సామూహిక హనుమాన్ చాలీసా భక్తి ప్రపత్తులతో పారాయణం చేశారు. తదనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం పట్టణంలోని మహిళలంతా ధార్మిక కార్యక్రమాలలో సత్సంగాలలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు అందరికీ దన్యవాదాలు తెలియజేశారు.



## పసికందును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** తెలంగాణ యావత్ సమాజం తలదించుకునేలా నగర్ కర్నూల్ జిల్లా కుమ్మేర మల్లన్న జాతరలో రజక కులానికి చెందిన కుటుంబం దైవ దర్శనానికి వెళ్ళితే టికెట్ లేదనే నెపంతో ఆ కుటుంబం పైన దాడి చేసి నెలల పసి కందు మరణానికి కారణమైన అగ్రకుల దూరహంకురులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ జనగామ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో కొమ్మెర ఘటనకు నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాంబయ్య మాట్లాడుతూ.. దైవదర్శనానికి వెళ్లిన రజక కుటుంబ యజమాని గణేష్ అతని బంధువులతో పాటు ఆడవాళ్లను కూడా విచక్షణ లేకుండా బూతులు తిట్టి గదిలో వేసి బంధించి అత్యంత పాషవికంగా దాడి చేయడం అనాగరిక చర్యలకు పాల్పడిన దుండగులు నెలల పాపను కాళ్లపై వేసిన కనికరించకుండా నెలల పాపను అత్యంత పాశ వికంగా కాళ్లతో తన్ని ఆ పసిపాప మరణానికి కారకులైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అగ్రకుల దృహంకారులను తక్షణమే శిక్షించి అరెస్టు చేసి శిక్షించాలని సాంబయ్య డిమాండ్ చేశారు. రజక సంఘం రాష్ట్ర నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, సిపిఐ ఎమ్మెల్యే వరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత, ఉద్యమకారుల సంఘం నాయకులు రాములు నాయక్ సంఘీ వెంకన్న. ఎమ్మార్పీఎస్ నాయకులు జలగం నరేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడవెల్లి సోమ మల్లయ్య. సిపిఎం సీనియర్ నాయకులు సోమ అశోక్ బాబు.అనుముల అంజిరావు, చిట్యాల సమ్మయ్య, పొలాస సోమయ్య.పొన్న యాకయ్య, ఏడవెల్లి దండయ్య, మార్కొండయ్య, సీపీఐ ఎం ఏల్ నాయకులు జీడీ సోమయ్య, మహంకాళి శ్రీనివాస్, కొనకటి కళింగరాజు, పెద్ది రాహుల్ పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అక్కన్నపేట ప్రజాప్రతినిధులు

**అక్కన్నపేట, మన చౌరాస్తా :** పొన్నం ప్రభాకర్ సమక్షంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ జన్నారపు సంపత్, ఉప సర్పంచ్ లంబ శ్రీలేఖ లు అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, అక్కన్నపేట గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అన్ని వర్గాల నాయకులు ఐక్యంగా పనిచేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలకు మేలుచేసే కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణరావు అన్నారు. మంగళవారం రాష్ట సచివాలయం నుంచి ఇంటర్ 10వ తరగతి పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కార్యదర్శులు, కమిషనర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరిక్షలు ఉంటాయని, 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉంటాయని, ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వెలుతురు, సరిపడా పర్నిచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు, పోలీస్ బందోబస్తు, ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. వీసీ అనంతరం ఎస్.ఎస్.సి (SSC) పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్ని లైన్ శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో మొత్తం 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని 6,445 మంది విద్యార్థులు ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరుకానున్నారన్నారు . ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.మల్లికార్జున్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారి సంపత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్, పోస్టల్ శాఖ అధికారులు, జిల్లా రవాణా అధికారి, వివిధ శాఖల అధికారులు, అదనపు డైరెక్టర్ సత్యమూర్తి, ఏసీజీఈటీ టి. రవి కుమార్, డీసీఈబీ జనగామ అసిస్టెంట్ సెక్రటరీ మెరుగు రామరాజు పాల్గొన్నారు.



# విద్యుత్ ఆఫీసర్లతో ఎమ్మెల్యే కడియం సమీక్ష




**హనుమకొండ, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన నియోజక వర్గం లో జరుగుతున్న విద్యుత్ పనుల పురోగతిపై హన్మకొండ నక్కలగుట్ట విద్యుత్ భవన్ లో మంగళవారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమీక్షా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ పూర్తిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు వ్యవసాయం మీద ఆధార పడి దేవాదుల వలన రిజర్వాయర్లో నీళ్లు రావడం చేత పంటల దిగుబడి పెరిగిందని అన్నారు . సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తమ నియోజక వర్గానికి కొత్త 33/11 కెవి సబ్ స్టేషన్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు . కొత్తగా మంజూరు అయ్యిన సబ్ స్టేషన్ ల పనుల పురోగతి పై చర్చిస్తూ సాగరం , కొండాపూర్ , కూర్చపల్లి సబ్ స్టేషన్లు ఈ మార్చి నెలాఖరు వరకు చార్జ్ చేసి అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు . మిగతా సబ్ స్టేషన్ ల టెండర్ ప్రక్రియ , ల్యాండ్ కేటాయింపు తదితర ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు . ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ గృహాల పై వెళ్తున్న లైన్లను తొలగించాలని , లైన్లు లైని చోట కొత్త లైన్ల విస్తరణ జరపాలని అన్నారు . అలాగే కొత్త మీటర్ల మంజూరు చేయాలనీ చెప్పారు . వినియోగదారులు మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాడనికి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు . రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంచి సేవలు అందిస్తున్నారని , సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి రైతుల కొరకు ఎన్నో కార్యక్రమాలు తీసుకు వచ్చారని అందులో పొలం బాట , ఎస్టిమేట్ తెలుగులో అందించడం , త్వరితగతిన సర్వీసుల మంజూరు చేస్తున్నారని అన్నారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పల్లె బాట కార్యక్రమంలో మధ్య స్థంబాలు వేస్తున్నామని , ప్రమాదభరితంగా ఉన్న లొకేషన్లు గుర్తించి వాటిని మార్చుతున్నామని చెప్పార . అత్యవసర సమయాల్లో బ్రేక్ డౌన్ టీం లు ఏర్పాటు చేసినామని చెప్పారు . కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి . మోహన్ రావు , డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్ , సి.ఈ లు రాజు చౌహాన్ , సురేందర్ , ట్రాన్స్కో సి.ఈ జోన్ వరంగల్ శ్రీ రామ్ కుమార్, జనగాం ఎస్ ఈ సంపత్ రెడ్డి , హన్మకొండ ఎస్ ఈ పి . మధుసుధన్ రావు , డి .ఈ లు లక్ష్మి నారాయణ రెడ్డి , సారయ్య ,, విజయేందర్ రెడ్డి , మల్లికార్జున్ , విజయ కుమార్ , అనిల్ కుమార్ , సంపత్ రావు, ఏడీఈ రణధీర్ రెడ్డి , సుధాకర్ , అనిల్ కుమార్, ట్రాన్స్కో అధికారులు పాల్గొన్నారు.



# హనుమకొండలో డెస్క్ జర్నలిస్టుల ధర్నా

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డెస్క్ జర్నలిస్టులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డెస్క్ జర్నలిస్ట్ లతో పాటు అన్ని విభాగాల్లో అక్రిడిటేషన్ కార్డులు తగ్గింపు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు ఆందోళనలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగానే హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో డెస్క్ జర్నలిస్ట్ లతో పాటుగా మిగతా యూనియన్ల నాయకులు పాల్గొని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డెస్క్ జర్నలిస్టులకు గతంలో వలే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బిఆర్ లెనిన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్,టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్,గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, డెస్క్ జర్నలిస్టులు శంకేషి శంకర్ రావు, సిహెచ్ సోమనర్సయ్య, వర్దెల్లి లింగయ్య, అల్లం రాజేష్ వర్మ, నాయకులు కోరుకొప్పుల నరేందర్, బోల్ల అమర్, బొడిగె శ్రీనువాస్, సంపత్ రావు, కిరణ్ రెడ్డి,పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.సుధాకర్, శ్రీకాంత్, వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బడికి టీవీ బహూకరించిన

# ఉపాధ్యాయుడు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** దర్దేపల్లి పాఠశాల నుంచి ఇటీవల వడిచెర్ల సధాకర్ పదవీ విరమణ పొందారు. విద్యార్థుల ప్రయోజనార్థమై పాఠశాలకు జీవితాంతం జ్ఞాపకంగా ఉండేవిధంగా రూ. 12 వేల విలువగల 32 ఇంచుల LED TV బహూకరించారు. బడి ప్రధానోపాధ్యాయులు దేవగిరి సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు వెంకట నరసయ్య, నాగజ్యోతి అభినందించారు. వెంకటేషం, నాగజ్యోతి, శ్రీనివాసు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.







# టార్గెట్.. ఆరోగ్య జనగామ

- 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి స్క్రినింగ్
- మధుమేహం, అధిక రక్తపోటు బారిన పడకుండా చర్యలు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఆరోగ్య జనగామ కార్యక్రమాన్ని ఆదర్శ ప్రజారోగ్య కార్యక్రమంగా తీర్చిదిద్ది, జనగామ జిల్లాను మధుమేహం, అధిక రక్తపోటు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కట్టుబడి ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, నిరోధక, ప్రోత్సాహక ఆరోగ్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా... జిల్లాలో తొలిసారిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వినూత్న ఆరోగ్య కార్యక్రమం 'ఆరోగ్య జనగామ'కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో డీఎంహెచ్‌వో తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు, స్థానిక సంస్థల సమన్వయంతో జిల్లాలో ప్రజల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు . ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి ఎంపీడీవోలు, సర్పంచ్‌ల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వారు సమన్వయంతో పనిచేసి గ్రామ స్థాయిలో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. 30 సంవత్సరాలపై బడి ఉన్న ప్రతీ ఒక్కరిని హైపర్ టెన్షన్, దయాబెటీస్ స్క్రినింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ముందస్తుగా వాటిని గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్‌లో చాలా మందిని ఈ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. ఈ రోజు ఈ కార్యక్రమ ప్రారంభం సందర్భంగా జిల్లా లోని అన్ని పీహెచ్‌సీల వైద్య అధికారులకు స్క్రినింగ్‌కి సంబంధించిన అవగాహన కల్పించి అలాగే క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. ఈ ఓరియంటేషన్ సమావేశంలో డీఆర్డీఏ వసంత, జిల్లా పంచాయతీ అధికారి నవీన్, జిల్లాలోని వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**సిద్దిపేట, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ఏర్పాట్లను తనిఖీ చేశారు.హాస్టల్‌లో వడ్డించిన అన్నం, క్యాబేజీ కూర, టమాటా చట్నీ, సాంబారు వంటి వంటకాలను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. మొత్తం 100 మంది విద్యార్థులు నమోదు కాగా, ప్రస్తుతం 83 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నట్లు విద్యార్థులు తెలిపారు.విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు అందజేయాలని, ప్రతి వంటకం రుచికరంగా ఉండి అందరికీ సరిపడా ఆహారం పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వసతి మరియు భోజన విషయాల్లో ఎలాంటి కొరతలు లేకుండా చూడాలని సూచించారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేయాలని, అక్కడ జరిగే ప్రతి చర్య రికార్డు కావాలని వార్డెన్ శ్వేతకు స్పష్టం చేశారు.స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, వంట సరుకుల వినియోగం, నమోదైన వివరాల మధ్య తేడాలు ఉన్నట్లు గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణలో లోపాలు ఉన్నందున వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా మరుగుదొడ్లు మరమ్మత్తులలో ఉన్నాయని తెలుసుకొని ఈడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులను వెంటనే పరిశీలనకు పంపాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా సరిపడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటానని, శానిటేషన్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.






# కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ

'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది.ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2 : గోస్ బియాండ'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**